ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



జ్వరంతో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: మండలంలోని బింపోల్ ఏపీటీడబ్ల్యూ ఏహెచ్ గర్ల్స్ పాఠశాలలో జ్వరంతో విద్యార్థిని మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... బింపోల్ ఏపీ టీ డబ్ల్యూ ఏ హెచ్ గర్ల్స్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జన్ని వైశాలి (11) గత రెండురోజులు గా జ్వరంతో బాధ పడుతోంది. శనివారం ఉదయం మరింత అస్వస్థతకు గురవడంతో బింపోల్ పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందిందని ఆసుపత్రి వైద్య సిబ్బంది నిర్ధారించారు. అనంతగిరి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు.



వైశాలి మృతదేహం

నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి విశాఖకు ప్రాధాన్యం

- ఎనిమిది మందికి అవకాశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రెండో విడత రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీలో ఉమ్మడి విశాఖకు ప్రాధాన్యత ఇచ్చింది. 59 మందితో కూడిన జాబితాను శనివారం ప్రకటించగా ఉమ్మడి విశాఖకు చెందిన వారే అందులో ఎనిమిది మంది ఉన్నారు. చైర్మన్ పదవులు దక్కడంతో వారిలోనూ, వారి అనుచరగణంలోనూ సంతోషం వ్యక్తమవుతోంది. పదవులు పొందిన వారిలో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎంవి.ప్రణవ్ గోపాల్ ఉన్నారు. ఆయనకు కీలకమైన విశాఖపట్నం మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) చైర్మన్ పదవి దక్కింది. దక్షిణ నియోజకవర్గానికి చెందిన టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్‌కు ఎన్‌టిఆర్ వైద్య సేవ చైర్మన్ పదవి వచ్చింది. ఇక టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జికి ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అనకాపల్లి జిల్లాకు చెందిన మాడుగుల నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పివిజి.కుమార్‌కు ఎపి కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. అనకాపల్లికి చెందిన మళ్ల సురేంద్రకు ఎపి గవర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అలాగే యలమంచిలి నియోజవర్గానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావుకు ఎపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అరకు నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్‌కు ఎపి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. దొన్నుదొరకు విజయనగరం ఆర్‌టిసి రీజనల్ బోర్డు చైర్మన్ పదవి లభించింది. పదవులు దక్కించుకున్న వారిలో ఒకరిద్దరు మినహా మిగిలిన అందరూ 2024 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలని భావించి, కూటమి పార్టీల మధ్య అవగాహన మేరకు పోటీ చేసే అవకాశం దక్కని వారే ఉన్నారు. తాజాగా వారిలో సంతోషం వ్యక్తమవుతోంది.



గండి బాబ్జి



ప్రణవ్ గోపాల్



పివిజి.కుమార్



ప్రగడ నాగేశ్వరరావు



శ్రవణ్‌కుమార్



సీతంరాజు సుధాకర్



సురేంద్ర



దొన్నుదొర

సాంకేతిక సమస్యలతో అందని ఉచిత గ్యాస్

ప్రజాశక్తి -సీలేరు

సాంకేతిక పరమైన సమస్యల వల్ల ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత గ్యాస్ జికె.వీధి మండలంలోని సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవులు పంచాయతీల పరిధిలోని వినియోగదారులకు అందని పరిస్థితి నెలకొందని సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్కే.సుభాన్, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ సీలేరు పంచాయతీలో 1020 కనెక్షన్లు ఉండగా, మిగతా పంచాయతీల్లో 1200 పైగా కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. సీలేరులో గ్యాస్ డిపో ఏర్పాటు కాక ముందు చింతపల్లి గ్యాస్ డిపో ద్వారా ఆయా పంచాయతీ ప్రజలు హెచ్‌పీ గ్యాస్ పొందేవారిని చెప్పారు. అప్పట్లో చింతపల్లి గ్యాస్ డిపోలో వినియోగదారులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినా, చింతపల్లి గ్యాస్ డిపో నుంచి సీలేరు గ్యాస్ డిపోకి ఆన్‌లైన్‌లో వినియోగదారుల వివరాలు పూర్తిగా బదిలీ చేయలేదని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత గ్యాస్ పొందలేక వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీలేరు ఒక్క పంచాయతీ పరిధిలో 70 నుంచి 80 వరకు గ్యాస్ వినియోగదారుల పేర్లు ఆన్లైన్లో బదిలీ కాలేదని, బదిలీ చేయడంలో చింతపల్లి గ్యాస్ డిపో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లరేషన్ కార్డులు కలిగిన వినియోగదారులు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత గ్యాస్ కోల్పోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా జిసిసి అధికారులు దీనిపై దృష్టి పెట్టి సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ పంచాయతీల ప్రజలు ఉచిత గ్యాస్ పొందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, బీసీ కాలనీ వాసులు

గిన్నెలకోటలో అపరిచితుల సంచారం

-పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
-భయాందోళనలో ఆదివాసీలు

ప్రజాశక్తి -పాడేరు /పెదబయలు: పెదబయలు మండలం మారుమూల గిన్నెలకోట పంచాయతీలోని పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు అపరిచిత వ్యక్తులు సంచరించడంతో ఆయా గ్రామాల్లో కలకలం రేగింది దోపిడీ దొంగల ముఠాగా గిరిజనులు అనుమానిస్తున్నారు . గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పెదబయలు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి. గిన్నెలకోట పంచాయతీ లోని పలు గ్రామాల్లో అర్ధరాత్రి హాల్ చల్ చేసిన ఈ అపరిచితులు. మూడు కార్లతో గ్రామాలకు వచ్చారు. వీరిని పలువురు గ్రామస్తులు పట్టుకొని బంధించారు. ఈ అపరిచిత వ్యక్తులు చత్తిస్ ఘడ్ రాష్ట్రానికి చెందిన వారిగా తెలుస్తోంది. వీళ్ళు శుక్రవారం పెదబయలు మండలంలో గల గిన్నెల కోట గ్రామ పంచాయితీ గిన్నెగరువు గ్రామంలో ఊరి చివర్లో 3 కార్లు ఆపి. రాత్రి 11గంటల సమయంలో ఇంటి ఇంటికి నిద్రిస్తున్న వాళ్లకు బంగారం మరియు ఇంట్లో చొరబడి కావలసిన వస్తువులు తీసుకొనుటకు ప్రయత్నిస్తుండగా కొంత మంది లేచి గట్టిగా కేకలు వేసి ప్రజలందరినీ అప్రమత్తం చేశారు. దీంతో చుట్టూ ప్రక్కల గ్రామాల వారు కూడా అక్కడకు చేరుకొని జనం పెద్ద ఎత్తున పోగై అపరిచిత వ్యక్తులు ఐదుగురిని పట్టుకొని కట్టి ఉంచారు. వీరికి తెలుగు భాష కూడా రాకపోవడంతో వీరంతా దోపిడి దొంగల ముఠా వారేనని అందరిలోనూ అనుమానం భయాందోళనలు వ్యక్తం అయ్యాయి అపరిచిత వ్యక్తుల్లో ఇంకో నలుగురు పారిపోతుండగా బొంగరం గ్రామ పంచాయితీ వంచుర్ల గ్రామంలో బంధించి ఉంచి పెదబయలు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించగా ఎస్ఐ తో పాటు స్టేషన్ సిబ్బంది వచ్చి మూడు కార్లు వాళ్ళను స్టేషన్ లో తీసుకొని పోయి విచారిస్తూ న్నారు ఇటువంటి అపరిచిత వ్యక్తుల ముఠాలు ఇంకో రెండు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది గిరిజన గ్రామాల్లో ప్రజలు కుటుంబ సభ్యులు అన్ని విధాలా అప్రమాత్తంగా ఉండాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



పట్టుబడిన అపరిచితులు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని విఆర్.పురం బీసీ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపిడిఒ శశిభూషణరావు అన్నారు. బీసీ కాలనీ వాసులతో శనివారం ఎంపిడిఒ సమావేశం నిర్వహించారు. ముందు గ్రామ ప్రజలు మాట్లాడుతూ 40, 50 ఏళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదని వాపోయారు. ప్రధానంగా తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు లైన్లు వంటి మౌలిక వసతులు సమస్యలు ఉన్నాయని తెలిపారు. పోలవరం ప్యాకేజీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో శశిభూషణరావు మాట్లాడుతూ గ్రామంలో అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. చేతివృత్తుల వారికి బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు ముత్యాల సాయిబాబు, సర్పరాజ్, వరసాల శ్రీనివాసరావు, ముయ్యాటి నరేష్, ముయ్యాటి పుల్లారావు, ములకలపల్లి సరోజిని, బింగు విష్ణుమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అరకులోయకు తరలివచ్చిన పర్యాటకులు

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడి సందడి నెలకొంది. రెండో శనివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలైన గిరిజన సంస్కృతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం వంటి సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో అరకులోయ టౌన్ షిప్ లో సందడి నెలకొంది . ఈ మధ్యకాలంలో ఎక్కువ మొత్తంలో పర్యాటకులు తరలి రావడం ఇదే తొలిసారి. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆయా సందర్శిత ప్రాంతాల్లో ప్రవేశ రుసుం ద్వారా ఆదాయం సమకూరింది. పర్యాటకులు ఎక్కువమంది తరలి రావడంతో స్థానిక వర్తకులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఊహించని విధంగా సందర్శించడంతో హోటల్, లాడ్జిలు, క్యాంపింగ్ టెంట్లు,రిసార్ట్స్,యజమానులకు కూడా మంచి ఆదాయం సమకూరింది.

సచివాలయ హెల్త్ సెక్రటరీల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సచివాలయం హెల్త్ సెక్రటరీల నూతన కమిటీని పాడేరులో ఏర్పాటు చేశారు. సీఐటీయూ నాయకులు ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా ఏర్పడిన ఈ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. ఈ సచివాలయ హెల్త్ సెక్రటరీల నూతన జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా శెట్టి నాగరాజు , జిల్లా అధ్యక్షురాలిగా ఎం వివిఎస్ కుమారి ప్రధాన కార్యదర్శిగా తుల బోతి, కోశాధికారిగా అంబిక ఉపాధ్యక్షురాలుగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా అనిత రాణి తో పాటు మరో పదకొండు మందిని ముఖ్య కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ వివిఎస్ కుమారి, తులబోతి మాట్లాడుతూ సచివాలయ హెల్త్ సెక్రటరీ సమస్యలను ఎవరు పట్టించుకోవడంలేదని ఎన్నిసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదని వ్యక్తం చేశారు. ముఖ్య సచివాలయం హెల్త్ సెక్రటరీలు సచివాలయంలోనే ఫేషియల్ అటెండెన్స్‌తో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సచివాలయం హెల్త్ సెక్రటరీలకు మాత్రం యూనిఫాంలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.బ హెల్త్ సెక్రటరీ లకు ప్రమోషన్ కల్పించాలని, 6 సీనియర్ లిస్టులో జరుగుతున్న అవకతవకల విషయమై పలుమార్లు అధికారులకు తెలియపరిచినా నేటికీ ఆ సమస్య పరిష్కరించలేదని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎల్.సుందర్రావు మాట్లాడుతూ, జిల్లాలో హెల్త్ సెక్రటరీ సమస్యలను పరిష్కారం చేయాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం చేయాల్సి వస్తుందని తెలిపారు.



కుమారి, అధ్యక్షురాలు



బోతి ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయ సమస్యలపై ఉధృత పోరాటాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయు ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశిక వెంకట సుబ్బారావు, కానెం శ్రీను స్పష్టం చేశారు. ఎఆర్‌సి కార్యాలయం వద్ద శనివారం యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి విల్సన్ బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత కార్యదర్శి నివేదికను పూర్వ ప్రధాన కార్యదర్శి రమణ ప్రవేశ పెట్టారు. గత కార్యక్రమాలు, విరాళాల సేకరణ, జమ ఖర్చుల వివరాలను తెలియజేశారు. మండల కోశాధికారి కె.శ్రీను మండల ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా కారం రాంబాబు, అధ్యక్షులుగా పివి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా కానెం శ్రీను, సహాధ్యక్షులుగా గొలగాని శ్రీను, కోడూరు లోవరాజు, కోశాధికారిగా ఆవూరి సతీష్, ఎఫ్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా బూడి శ్రీనుబాబు, పత్రిక కార్యదర్శిగా టిఎల్ఎన్ మూర్తి, మహిళ కార్యదర్శిగా తాడే వీర వెంకట లక్ష్మీ ప్రసన్న, కార్యదర్శులుగా నీలాద్రి రాజబాబు, జంప రాంబాబు, బీరబోయిన మురళీకృష్ణ, మిరియాల సత్యవతి, రెడ్డి లక్ష్మి, పుల్లి రామకృష్ణ, ఈక గోపి, మండల ఆడిటర్‌గా మఠం చంద్రశేఖర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.





యుటిఎఫ్ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన సుబ్బారావు, శ్రీను


ఎటిఎ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- కూనవరం

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఎటిఎ) ఆవిర్భావ దినోత్సవం కూనవరం మండలం జగ్గవరం క్రాస్ రోడ్ వద్ద శనివారం నిర్వహించారు. అసోసియేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటిసి ఏర్పడిన నాటి నుండి సభ్యత్వం తీసుకున్న ఆదివాసీ ఉపాధ్యాయులకు అనేక సేవలు చేసినట్లు చెప్పారు. ఏజెన్సీలో 100శాతం పదోన్నతులు ఆదివాసీ ఉపాధ్యాయులకు అందేలా కృషి చేసిందన్నారు. సుప్రీంకోర్టు జీవో నెంబర్ 3ని రద్దు చేసిన నేపథ్యంలో ఏజెన్సీలో ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడానికి ప్రత్యేక ఏజెన్సీ ఉద్యోగ నియామక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా 100శాతం ఉద్యోగాలు ఏజెన్సీ ఆదివాసులకు దక్కేలా ఏజెన్సీ ఫలాలు అందేలా చట్టం చేయాలని కోరారు. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్న మెగా డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ మండల అధ్యక్షులు చిచ్చడి జితేంద్ర, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చిచ్చడి అప్పారావు, ఆదివాసీ సంఘాల నాయకులు తష్షి జోగారావు, చిచ్చడి చందర్రావు, కాక రాజు, పిడి రమేష్, కుంజా జితేంద్ర, ఉర్మ బాలాజీ, పాయల భవాని, మల్లం రామ తులసి, నరకం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎటిఎ నాయకులు అనిల్‌కుమార్



వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-దేవీపట్నం : రాష్ట్రంలోని 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, 104 వైద్య సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎంపీడీవో, తహశీల్దారుకు 104 ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక పరమైన అంశాలన్నీ ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో పిఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ వైవి.రమణ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండా సతీష్ మాట్లాడుతూ సిహెచ్‌సిలో ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే వైద్య పరీక్షలను గర్భిణులు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉండే గర్భిణులకు ఆశా, అంగన్వాడీ వర్కర్లు తమ వంతు బాధ్యతగా తెలియజేయాలని సూచించారు. హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు గర్భిణులకు వచ్చే సమస్యలు, పాటించవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న కుమారి, హెడ్ నర్సు నాగమణి, హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు అనంతబాబు, ధనలక్ష్మి పరామర్శ

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రం తిమ్మాపురం పంచాయతీ బొంగరాలపాడు ఇసుక ర్యాంపు వద్ద ఏలేరు కాలువలో గల్లంతై మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి శనివారం పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి బంధువులు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడం చాలా బాధాకరమని, ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అనంతబాబు శవరాజకీయాలు మానుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రంపచోడవరం

అడ్డతీగల మండలం ఏలేరు వాగు వద్ద జరిగిన సంఘటన నేపథ్యంలో ఎమ్మెల్సీ అనంతబాబు శవరాజకీయాలు మానుకోవాలని, లేకుంటే ప్రజలు తిరుగుబాటు చేస్తారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాద సంఘటనను కూడా రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో అనంతబాబు మాఫియా యంత్రాలతో ఇసుక తవ్వి తరలించడం వల్లే బొంగరాలపాడు వద్ద గోతులు పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పి.మోహన్, మాజీ అధ్యక్షులు అడబాల బాపిరాజు, నాయకులు సలాది బాపిరాజు, క్లస్టర్ ఇంచార్జి కే సింహాచలం, టౌన్ ప్రెసిడెంట్ డి జనార్ధన్, రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



దొన్నుదొరకు వినతిపత్రం ఇస్తున్న విఒఎలు

దొన్నుదొరకు విఒఎల వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మూడేళ్ల కాల పరిమితి ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ టిడిపి అరకు ఇన్చార్జి దొన్నుదొరకు వీవోఏలు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ సంఘం మండల అధ్యక్షుడు భాస్కరరావు అన్నారు. ఇప్పటికి మూడు నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని వినతి పత్రంలో కోరామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వివోఏలు పాల్గొన్నారు.

సమిష్టి కృషి ద్వారా మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి -తగరపువలస : సమిష్టి కృషి ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విశాఖ ఐఐఎం అకడమిక్స్ డీన్ ఎం.విజయభాస్కర్ చెప్పారు. స్థానిక ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'యూత్ ఫర్ ఎ సస్టెయిబుల్ ఫ్యూచర్" అంశంపై మోడల్ యునైటెడ్ నేషన్స్ సదస్సు నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే సదస్సులో శనివారం పలు అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కర్ మాట్లాడుతూ, సుస్థిరతా లక్ష్యాల సాధనలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రోజు వారీ పరిణామాలు, స్థానిక సమస్యలపై అవగాహన పెంచుకునేందుకు ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. యువ నాయకత్వం, విమర్శనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. పలు దేశాల నుంచి యువ డిబేటర్లు, డిప్లమాట్లు సదస్సుకు హాజరయ్యారు.

'సాహితీ ప్రవీణ' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ దొడ్డి ప్రవీణ రాసిన "సాహితీ ప్రవీణ" గ్రంథాన్ని శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాహితీ ప్రవీణ గ్రంథంలోని వ్యాసాలు సమాజానికి మనోవికాసం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి మాట్లాడుతూ, గ్రంథంలో ఉండే వ్యాసాలు ప్రాచీనం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక కోణాల్లో ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సహదేవుడు, వై.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, డి.మాధురి, వై.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథ రచయిత్రి డాక్టర్ ప్రవీణను అభినందించారు.

'బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా జరుగుతున్న ఎన్నికల విధానానికి స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని పలు దళిత, బహుజన సంఘాలు, పార్టీల నేతలు డిమాండ్ చేశారు. రామా టాకీస్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్‌లో మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపకుడు సంగటి మనోహర్ మహజన్ అధ్యక్షతన చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, బహుజన సంఘాలు, పార్టీల నేతలు బొడ్డు కళ్యాణ రావు, జె.వి.ప్రభాకర్, డాక్టర్ బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, చింతాడ సూర్యం, సుధాకర్, కొత్తపల్లి వెంకటరమణ, వసంత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చని అనేకమంది నిపుణులు నిరూపిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ పేపర్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దాన్ని మార్చేసి కుట్ర సాగుతోందని ఆరోపించారు.

వంతెన లేక వెతలు

కుడుముసారి, తమ్మంగుల పంచాయతీల ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని కుడుము సారి, తమ్మంగుల పంచాయతీల లక్ష్మీపురం గొర్రెల మెట్ట గ్రామాల నడుమ ఉన్న వాగుపై వంతెన నిర్మించండి మహాప్రభో అంటూ ఆ రెండు పంచాయతీలకు చెందిన గిరిజనులు అధికారులను వేడుకుంటున్నారు. ఆ పంచాయతీలకు చెందిన తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య, కుడుము సారి పంచాయతీ వార్డు సభ్యుడు బోండా సింహాచలంలు శనివారం మాట్లాడుతూ, తరతరాలుగా తమ పంచాయతీలను పట్టి పీడిస్తున్నవి రహదారి, వంతెన సమస్యలేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా తమ పంచాయతీలో కనీస వసతులైన రహదారి, వంతెనల నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది అధికారులు వచ్చి పోతున్నా సమస్యను పట్టించుకోలేదన్నారు. వర్షాలు కురిసినప్పుడు ఈ వాగు ప్రమాద భరితంగా ప్రవహిస్తూ ఆయా గ్రామాల ప్రజలకు సంబంధాలు తెగిపోతున్నాయని తెలిపారు. ఎవరికి ఆరోగ్యం బాగోలేకున్నా ప్రాణాలకు తెగించి ప్రమాద భరిత వాగును దాటవలసిన పరిస్థితులు ఎదురవు తున్నాయన్నారు. గత నెలలో కుడుము సారి సర్పంచ్ అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ ఆకస్మికంగా మరణిస్తే ఆమె పార్థివ దేహాన్ని గొర్రెల మెట్ట సమీప స్వగ్రామమైన భీమనాపల్లికి తరలించేందుకు, అంత్యక్రియలకు పలువురు గ్రామానికి చేరుకునేందుకు పడిన కష్టాలు అన్నీ ఇన్ని కావన్నారు. అధికారులు దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా గొర్రెల మెట్ట వంతెన నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు.



గెడ్డను దాటి వెళుతున్న ప్రజలు

దొన్ను దొర, కిడారిలకు శుభాకాంక్షల వెల్లువ



దొన్నుదొరకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ : విజయనగరం ఆర్టీసీ రీజనల్ బోర్డు చైర్మన్‌గా నియామింపబడిన తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జి దొన్నుదొర, జీసీసి చైర్మన్ గా నియామకం కాబడిన కిడారి శ్రావణ్ కుమార్‌లకు పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి. ఈ సందర్భంగా అరకులోయ పార్టీ నాయకులు స్వీట్లు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేస్తూ దొన్ను దొరకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల రెండవ జాబితాలో విజయనగరం ఆర్టీసీ రీజనల్ బోర్డు చైర్మన్‌గా దొన్ను దొర పేరు ఖరారు కావడంతో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేదలడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, టిడిపి నాయకులు చందు, త్రినాధ్, దొన్ను దొర ను కలుసుకొని మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అరకులోయ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు మిఠాయిలు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు.

పాడేరు: మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్‌ను గిరిజన సహకార సంస్థ చైర్మన్ పదవి వరించింది. అధిష్టాన నాయకులు చంద్రబాబు, నారా లోకేష్ తో సత్సంబంధాలతో మెలిగారు. జిసిసి చైర్మన్‌గా శ్రావణ్ నియమితులు కావడంతో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. టిడిపి సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి ఆధ్వర్యంలో పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రావణ్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు పాడేరు లోని శ్రావణ్ వ్యక్తిగత పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. పలువురు సర్పంచులు, తెలుగుదేశం పార్టీ నేతలు శ్రావణ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అనుచరులు పార్టీ శ్రేణులంతా హర్షం వ్యక్తం చేశారు.

డుంబ్రిగుడ: రాష్ట్ర జిసిసి చైర్మెన్‌గా మాజీ మంత్రి శ్రావణ్ కుమార్, టిడిపి అరకు ఇంచార్జ్ ఎస్ దొన్ను దొరను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, నాయకులు పాడేరులోని ఆయన నివాసంలో చేరుకుని పుష్పగుచ్చాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి చినగెన్ను పాల్గొన్నారు.



కిడారికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్ మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని బస్సు ఢీకొని ట్రాన్స్ జెండర్ మృతి చెందినట్లు సిఐ సన్నిబాబు తెలిపారు. నాతవరం కు చెందిన అంకురెడ్డి రాజబాబు (30) 7 సంవత్సరాల క్రితం ఇంటి నుండి బయటకు వచ్చి రాధిక గా పేరు మార్చుకుని ట్రాన్స్ జెండర్ గా తునిలో ఉంటుంది. తోటి ట్రాన్స్ జెండర్ లతో కలిసి శుక్రవారం రాత్రి కాగిత టోల్ గేట్ వద్ద భిక్షాటన చేస్తుండగా గుర్తుతెలియని బస్సు ఢీకొనడంతో ట్రాన్స్ జెండర్ అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్ జెండర్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ వెల్లడించారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏటిగైరంపేట గ్రామ శివారులో శనివారం 1.50 కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగిందని గొలుగొండ ఎస్సై రామారావు తెలిపారు. ఏఎస్సై పూర్ణచంద్రరావుకు ముందుగా అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టి ముగ్గురిని తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో వీరి వద్ద ఈ గంజాయి లభ్యమైందన్నారు. ఈ మేరకు విజయవాడకు చెందిన పూసల అరవింద్, బండిగట్ల కృపరాజు, పార్వతీపురం జిల్లాకు చెందిన పొందూరు మురళీకృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మదుం కూలిపోయి రైతు దుర్మరణం

ప్రజాశక్తి-కె.కోటపాడు : పంట పొలాలకు నీరు విడిచిపెట్టేందుకు చెరువు మదుం తీస్తుండగా మదుం గోడ కూలిపోయి రైతు దుర్మరణం చెందిన సంఘటన కె.కోటపాడు పంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని సింగన్నదొరపాలెం శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన రొంగలి కన్నబాబు (64) తన మిత్రుడు డోకల మోహన సన్యాసిరావుతో కలిసి శనివారం కె.కోటపాడు గ్రామంలోని పైడమ్మ చెరువు వద్దకు వెళ్లారు. చెరువు మదుముకు అడ్డంగా ఉన్న ఇసుక బస్తాలను తొలగిస్తుండగా, ఒక్కసారిగా మదుం గోడ కూలిపోయి కన్నబాబుపై పడింది. దీంతో కన్నబాబు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమీపంలో రైతులందరూ మదుం పగలగొట్టి మృతదేహాన్ని ఒడ్డికి తీశారు. మోహన సన్యాసిరావు కొద్దిపాటి గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. కన్నబాబు భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

ప్రజాశక్తి-కశింకోట : తీవ్ర అనారోగ్యం కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని చెరకాము గ్రామానికి చెందిన రెడ్డి బాబ్జి (29) అనే యువకుడు విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రెడ్డి బాబ్జి 15 సంవత్సరాల నుండి ఆస్తమా, బ్లడ్ ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నాడు. తీవ్ర అనారోగ్యం కారణంగా బాబ్జి డిప్రెషన్‌కు గురై మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఇంటి వద్ద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాబ్జిని అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం బాబ్జి మృతి చెందాడు. మృతుని తండ్రి కన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన దాసరి ఆనంద్ (53) శనివారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... దాసరి ఆనంద్ శనివారం గేదెలు మేపడానికి వెళ్లాడు. గేదెలకు నీరు కోసం ఏలేరు కాలువలో దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన గ్రామస్తులు బయటకు తీసి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. ఇప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆనంద్ భార్య దాసరి లక్ష్మి ఫిర్యాదు చేసిన మేరకు కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



న్యాయ అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

చట్టాలు, హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-దేవీపట్నం : భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపైనా, బాలల హక్కులపైనా అవగాహన కల్పిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ తెల్లం శేఖర్ తెలిపారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా మండలం ఇందుకూరు గ్రామపంచాయతీ పరిధి కొత్తవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులకు నాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, బొరగ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా.. ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి, వైసిపి కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వ కార్యకర్తలు వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా పెడుతున్న అసభ్యకర, వ్యంగ్య పోస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి వైసిపి నాయకులు తరలివచ్చారు. నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ అజితకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పిన రోజు నుంచి వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై అరెస్టులు మొదలయ్యాయన్నారు. పవన్ వ్యాఖ్యల పై నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కోసం అరెస్టులు చేస్తున్నారన్నారు. విశాఖ జిల్లాలో తమ పార్టీకి చెందిన ముగ్గురు సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వ పెద్దలను సంతృప్తి పరచడం కోసం పదేపదే స్టేషన్లు చుట్టూ తమ పార్టీ కార్యకర్తలను తిప్పుతున్నారన్నారు. అత్యాచారాలు, హత్యలు చేసిన వారిపై పోలీసులు తమ ప్రతాపం చూపించాలన్నారు. పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నేతల పైశాచిక ఆనందంతో గీతాంజలి అనే మహిళ మరణించిందన్నారు. మహిళలకు అండగా ఉంటామని పవన్ కల్యాణ్ చెప్పారని, మరి గీతాంజలికి ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. తాము ఇచ్చిన కంప్లైంట్ పై కనీసం స్టాంపు వేయలేదని, పెట్టిన సంతకాన్ని కూడా కొట్టివేశారని తెలిపారు. టిడిపి కార్యకర్తల్లా పోలీసులు మారిపోవడం తగదన్నారు. ఇప్పటికే అక్రమ అరెస్టులపై హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. అరెస్టులు చేసినంత మాత్రాన భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు, వైసిపి మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగులకు.. మినిమం టైం స్కేల్ అమలుచేయాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : యుపిహెచ్‌సిలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం విశాఖ జిల్లా యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ, యుపిహెచ్‌సి కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని అన్నారు.

ఉక్కు కార్మికుల ఆకలి కేకలు పట్టవా..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించని ఉక్కు యాజమాన్యానికి కేంద్ర బిజెపి అండగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కార్మికులు చేసిన ఉక్కు ఉత్పత్తితో గడచిన 15 రోజుల్లో స్టీల్ అమ్మకం ద్వారా సుమారు రూ.650 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యాయి. ఇంతలా ఉక్కు ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు స్టీల్ మేనేజిమెంట్ జీతాల్లేకుండా ఆరు నెలలుగా కడుపులు మాడ్చేస్తున్నా 'కూటమి' పాలకులు ఏమయ్యారో ? ఎక్కడ దాక్కున్నారో ? ఎవ్వరికీ అర్థం కావడం లేదు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఒకవైపు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1367 రోజులుగా పోరాటాన్ని కొనసాగిస్తూనే ఇంతవరకూ ఏ రోజూ ఉత్పత్తిని ఆపలేదు. అయినప్పటికీ వారికి యాజమాన్యం జీతాలు సకాలంలో ఇవ్వడం లేదు.



పర్మినెంట్ ఉద్యోగులకు రెండు నెలలు దాటి, కాంట్రాక్టు కార్మికులకు 6 నెలలుగా యాజమాన్యం జీతాలివ్వకుండా తీవ్ర మానసిక ఆవేదనకు గురిచేస్తుండటం శోచనీయం. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణాలిస్తామని ఒకరు... అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపలేకపోతే పదవికి రాజీనామా చేస్తానని మరొక నాయకుడు ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకొని గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ వరకూ ఇవే చిలక పలుకులు పలుకుతూ గద్దెనెక్కారు. నేడు విశాఖ ఉక్కు కార్మికులంతా ప్రభుత్వం ఎక్కడుంది ? అంటూ ప్రశ్నించే పరిస్థితి నెలకొంది. ఈ నెల 10న కుటుంబాలతో సహా పాత గాజువాక జంక్షన్‌లో ధర్నాకు సిఐటియు ఇచ్చిన పిలుపునకు భారీ స్పందన లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిజంగా జీతాలివ్వలేని పరిస్థితి ఉందా ?

ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం చేతిలో ప్రస్తుతం రూ.950 కోట్లు ఉన్నాయి. కార్మికులకు మాత్రం జీతాలు చెల్లించడానికి రూ.80 కోట్లు వెచ్చించకపోవడం చూస్తే కావాలనే కడుపు మాడ్చి తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసే కుట్ర దీంట్లో దాగి వుందన్నది స్పష్టమవుతోంది. స్టీల్ ఉత్పత్తిని మార్కెట్‌లో సేల్ చేయడం ద్వారా 15 రోజుల క్రితం సుమారు రూ.650 కోట్లు బ్యాంకులో జమ అయ్యాయి. ఇది కాకుండా మరో రూ.300 కోట్లు వరకూ డ్రా (కరెంట్ అకౌంట్) నుంచి చేసేందుకు అవకాశం ఉంది. అర్థాకలితో కార్మికులు ప్లాంట్‌లోకి వెళ్లి ఉత్పత్తి చేస్తూ ఉన్నా యాజమాన్యం మాత్రం జీతాలు చెల్లించకపోవడం వెనక కేంద్రంలోని బిజెపి హస్తం లేకుండా ఉంటుందా ? అన్నది చర్చ. రాష్ట్రంలోని కూటమి నేతలైన తెలుగుదేశం, జనసేన కార్మికులకు జీతాలివ్వని ఉక్కు యాజమాన్యాన్ని ప్రశ్నించకపోవడాన్ని చూస్తే వారు ఎటువైపు ఉన్నారో ఇట్టే అర్థమవుతుంది.

ఆగని కుట్రలు

జీతాలే కాదు.. ఉద్యోగులను తొలగించే కుట్రల నుంచీ యాజమాన్యం వెనక్కి వెళ్లలేదు. మరోవైపు రా మెటీరియల్‌కు కేంద్రం అనుమతించడం లేదు. విశాఖ ఉక్కును ఇన్ని విధాలా దిగ్బంధనం చేస్తే ఎవరు రక్షిస్తారు ? అన్న ప్రశ్న ఈ ప్రాంత ప్రజానీకంలో రేగుతోంది. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో ముందుకెళ్లడానికి కూటమి నుంచి ఇసుమంతైనా సహకారం లేదు. ఈ విషయమై ఉక్కు కార్మికవర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది.

నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - దేవరాపల్లి : గిరిజనులకు, ప్రజలకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్లాంట్‌ను ఐక్యంగా అడ్డుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిపిఎం దేవరాపల్లి మండల మహాసభ శనివారం షేక్ అప్పాసాహిబ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ అదానీ కన్ను పడిన ప్రాంతమంతా నాశనమవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రైవాడ, కోనాం ప్రాజెక్టులను, అటవీ ప్రాంతాన్ని దోచుకునే పనిలో అదానీ ఉన్నాడని, దీన్ని ప్రజలు గుర్తెరగాలని అన్నారు. ప్రధాని మోడీ అదానీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని తెలిపారు. అంబానీ, అదానీ మోడీకి రెండు కళ్లు వంటివారన్నారు. వారికి దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. రైవాడ ప్రాజెక్టును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. దేవరాపల్లి హోల్ సేల్ కూరగాయల మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌తో కూడిన డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, అన్ని గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు వేయాలని, జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. శారదా నదిపై బ్రిడ్జి, రెండు వైపులా ఎప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అధిక ధరలను నియంత్రించాలని కోరుతూ ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న లోకనాథం

దేవరాపల్లి మండల కార్యదర్శిగా బిటి.దొర

14 మందితో సిపిఎం దేవరాపల్లి మండల కమిటీ ఎన్నికైంది. మండల కార్యదర్శిగా బిటి.దొర, కమిటీ సభ్యులుగా ఎం.ఎర్రునాయుడు జె.ఈశ్వరరావు, సిహెచ్.లక్ష్మి, సిహెచ్.చినదేముడు, కాశీఈశ్వరరావు, డి.శంకర్ జె.పోతురాజు, వి.దొంగబాబు కె.సన్యాసినాయుడు షేక్ అప్పా సాహిబ్, ఇరట ఈశ్వరరావు. దుప్పి దాసు ఎన్నికయ్యారు. మండలాన్ని సమగ్రాభివృద్ధి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది.



మాట్లాడుతున్న వైద్యాధికారి సతీష్

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి-అడ్డతీగల : వృద్ధుల ఆరోగ్యంపై వారి పిల్లలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని సిహెచ్‌సిలో శనివారం ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వృద్ధుల పట్ల చేపట్టవలసిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ షుగర్, బీపీని నియంత్రణకు మందులు ఇవ్వడంతో పాటు సమతుల్యమైన ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచన శైలి కలిగి ఉండేటట్లు చూడాలని సూచించారు. హాస్పిటల్ కౌన్సిలర్ ఎన్.వాసు మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి ఆహారం తినాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మత్తువైద్యులు బి.రచన, చిన్నపిల్లల వైద్యులు పి.సత్యనారాయణ, హెడ్ నర్స్ నాగమణి, ఎన్ సిడి స్టాఫ్ ఎస్.సీతాదేవి, హాస్పిటల్ స్టాఫ్ నర్స్, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక శబ్దం చేసే సైలెన్సర్లు తుక్కుతుక్కు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలో అధిక శబ్దం చేసే, పొగను వెదజల్లే సైలెన్సర్లను పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. ఇటీవల కాలంలో యువత ఖరీదైన బైక్‌లకు కంపెనీ అమర్చిన సైలెన్సర్లను తీసివేసి, అధిక శబ్దం, పొగను వెదజల్లే సైలెన్సర్లను అమర్చి, మితిమీరిన శబ్ద, వాయు కాలుష్యానికి కారణం అవుతున్న వ్యవహారంపై పోలీస్ కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్, అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 181 సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆర్‌కె.బీచ్ వద్ద ఉన్న కాళీ మాత గుడి సమీపంలో శనివారం రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి సైలెన్సర్లను వాడడం భారత మోటార్ వాహన చట్టం–1988 ప్రకారం నేరమన్నారు. సెక్షన్ 190 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష లేదా రూ.10 వేలు జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సును మూడు నెలల పాటు సస్పెండ్ చేయనున్నట్లు తెలిపారు. ఇదే నేరం రెండవసారి చేస్తే ఆరు నెలల జైలు శిక్ష, లేదా రూ.10 వేలు జరిమానా విధించడంతో పాటు సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని చెప్పారు.

సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు నగరంలో హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినందుకు 70,500 మంది ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను మూడు నెలల పాటు సస్పెండ్ చేయమని రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారుడు, వెనుక కూర్చున్న వ్యక్తి తప్పనిసరిగా బిఐఎస్ మార్క్ హెల్మెట్ ధరించాలని స్పష్టంచేశారు.

'ఎస్‌సి వర్గీకరణ తగదు'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాల మహానాడు ఎస్సీ కులాల వర్గీకరణకు వ్యతిరేకమని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం విజయనగరం కన్వీనర్ ఎంవి.శివ, విశాఖ కన్వీనర్ కె.ఈశ్వర్ వీర కుమార్, భీమిలి మండల అధ్యక్షులు ప్రసాద్, బి.వెంకట రమణ పాల్గొన్నారు.